సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



ఉద్యోగ భద్రత కల్పించాలి

జగిత్యాల: మోడల్‌స్కూల్ హాస్టల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. సులోచన, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



వరికి ప్రత్యామ్నాయం..

జిల్లాలో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగవుతుంది. ఈ ఏడాది 9,100 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

కొండగట్టులో శ్రావణ సప్తాహ ఉత్సవాలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న సన్నిధిలో గురువారం శ్రావణ సప్తాహ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైనాయి. ఉదయం మండపంలో వాసుదేవ పుణ్యాహవచనం, రక్షబంధనం, స్వామివారికి పంచామృత అభిషేకం, తులసీదళార్చన, శ్రీవేంకటేశ్వరస్వామి శ్రీలక్ష్మీ అమ్మవారికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, వేంకటేశ్వరస్వామి తిరువీధి సేవతో పాటు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు పెద్ద జితేంద్రప్రసాద్‌స్వామి, ఉప ప్రధాన అర్చకుడు చిరంజీవస్వామి, చైర్మన్ మారుతస్వామి, ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి ఉండాలి



పోటీలను ప్రారంభిస్తున్న రవికుమార్

జగిత్యాల: చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి ఉండాలని జిల్లా క్రీడాఅభివృద్ధి అధికారి రవికుమార్ అన్నారు. గురువారం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మిడిల్ డిస్టెన్స్ రన్నింగ్ పోటీలు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలపై దృష్టి సారించి, గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి మాట్లాడుతూ, అండర్- 14, 16, 18, 20 బాలబాలికలకు, మహిళలు, పురుషులకు 600 మీటర్లు, 800 మీటర్లు, 1,500 మీటర్లు, 2,000 మీటర్లు, 3,000 మీటర్లు, 5,000 మీటర్ల విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో ప్రతిభ కబనర్చిన క్రీడాకారులను హైదరాబాద్‌లోని గోల్కొండ స్టేడియంలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న అజ్వర్ అక్తర్

కోరుట్ల: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు ఎండీ అజ్వర్ అక్తర్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు తెలంగాణ ఉర్దూ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో అవార్డుతో పాటు ప్రశంసాపత్రం, రూ. 25 వేల పారితోషికం అందించి సత్కరించారు. అక్తర్ పాఠశాలలో గణిత బోధనతో పాటు ఎస్‌సీఈఆర్‌టీ వారు నిర్వహించే వర్క్ షాపులో పాల్గొని ఉర్దూ శిక్షణలో ఎస్‌ఆర్‌పీగా, ఉర్దూ పుస్తకాల తయారీలో ట్రాన్స్‌లేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈసందర్భంగా అక్తర్‌ను హెచ్‌ఎం భూపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఖాజీపుర లోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఎంఏ లతీఫ్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వాటిలో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు రాగా, విచారణలో అవకతవకలు జరిగినట్లు తేలింది. ఈ నేపథ్యంలో సస్పెండ్ చేసినట్లు డీఈవో పేర్కొన్నారు.

రేపు 2కే రన్

జగిత్యాల: 18 ఏళ్లు నిండినవారికి కొత్త ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై శనివారం మినీ స్టేడియంలో 2కే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రవికుమార్ తెలిపారు. మినీస్టేడియం నుంచి పాత బస్టాండ్ మీదుగా మున్సిపల్ పార్క్ వరకు 2కే రన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అధికారులు, పీఈటీలు, యువజన సంఘాలు, మహిళలు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

- 8 నెలలు.. 24 హత్యలు
- నేరాల నియంత్రణకు పోలీస్‌శాఖ పటిష్ట చర్యలు
- ఈ ఏడాది ఇప్పటి వరకు 57 మందిపై కేసు
- ముగ్గురిపై పీడీయాక్ట్
- హత్య కేసుల్లో నిందితులపై రౌడీషీట్లు



మల్యాల మండలం మద్దుట్లలో జరిగిన హత్య స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

నేర ప్రవృత్తి!

జిల్లాలో మూడేళ్లలో జరిగిన హత్యలు..

ఏడాది	2021	2022	2023 (ఇప్పటి వరకు)
సంఖ్య	25	29	24

జగిత్యాలక్రైం: నేరాల నియంత్రణకు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నా కొంత మంది నేరాలనే ప్రవృత్తిగా చేసుకుని ఘటనలకు పాల్పడుతున్నారు. దీంతో వారి నేరాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు నిందితులకు శిక్షలు పడేలా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోంది. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 24 హత్యలు జరుగగా, 57 మంది నిందితులపై కేసులు నమోదు చేయడంతో పాటు ముగ్గురిపై పీడీయాక్ట్ ఓపెన్ చేశారు. చాలా వరకు ఆస్తిపంపకాలు, భూ వివాదాలు, వివాహేతర సంబంధాలు, పాత కక్షలు మనసులో పెట్టుకుని క్షణికావేశంలో హత్యలకు పాల్పడుతున్నారు. ఈనేపథ్యంలో హత్యలతో నేరుగా సంబంధం ఉన్న వారితో పాటు హత్యకు సహకారం, ప్రోత్సహించినవారికి, షెల్టర్ కల్పించిన వారిపై కూడా పోలీసులు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడుతున్నారు.

మళ్లీ నేరాలకు పాల్పడకుండా..

హత్య కేసుల్లో నిందితులు మళ్లీ నేరాలకు పాల్పడకుండా జిల్లా పోలీసులు రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నారు. 2- 3 హత్యల్లో సంబంధం ఉన్నవారిపై పీడీయాక్ట్ ఓపెన్ చేస్తుండగా, వారు జైలులోనే గడపాల్సిన పరిస్థితి నెలకొంది. పీడీయాక్ట్ ఓపెన్ అయి జైలులో ఉన్నవారి కేసుల విచారణ త్వరిత గతిన జరుగుతుండటంతో నేరం రుజువై నిందితులకు శిక్షలు పడే అవకాశం కూడా ఉంది. దీంతో పాటు సాక్షులను నిందితులు ప్రభావితం చేయకుండా జైలులోనే గడిపే పరిస్థితి ఉంటుంది. కాగా రౌడీషీట్ల కదలికలపై పోలీసులు ఎప్పటికప్పుడు నిఘా పెట్టడంతో పాటు వారిపై ఉన్న కేసులు రుజువు చేసేందుకు సాక్షులను ప్రబలోపెట్టకుండా చర్యలు చేపడుతున్నారు.

పక్కాగా ఆధారాల సేకరణ

జిల్లాలో జరిగిన హత్యల్లో నిందితులకు శిక్షలు పడేలా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతోంది. నిందితులు పథకం ప్రకారం ఎలా హత్యకు పాల్పడ్డారనే కోణంతో పాటు, హత్య జరుగుతున్న సమయంలో ఉన్న ప్రత్యక్ష సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. హత్యలు జరిగిన తర్వాత చేపట్టే విచారణ నివేదికలను పకడ్బందీగా తయారుచేస్తూ నేరాలను రుజువు చేసేలా చర్యలు చేపడుతున్నారు. ప్రతీ కేసులో ఇన్వెస్టిగేషన్ చేస్తూ నిందితులు తప్పించుకోకుండా కేసుల్లో సరైన ఆధారాలు సేకరించి చార్జీషీట్‌లో పొందుపరుస్తూ నేరాలు రుజువు చేసేలా చూస్తున్నారు.

నిందితులపై రౌడీషీట్లు



“జిల్లాలో జరుగుతున్న హత్య కేసుల్లో నిందితులపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నాం. నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. రెండుమూడు హత్య కేసులు ఉన్నవారిపై పీడీయాక్ట్ ఓపెన్ చేస్తున్నాం. చాలా కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా పోలీసు శాఖ పక్కా దర్యాప్తు, పకడ్బందీ చర్యలు చేపడుతోంది.

– ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



ధర్మపురిలో చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి

ధర్మపురి: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరంగా నిలిచిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి పట్టణంలో గురువారం నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు చెల్లించలేని వారికి సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలిచిందన్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 21 మంది బాధితులకు రూ.5.77 లక్షల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ద్వారా హెవీ మోటార్ వెహికిల్స్ డ్రైవింగ్ శిక్షణపై టీఎస్‌ఆర్టీసీ ద్వారా అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే షెడ్యూల్డ్ కులాలకు చెందిన లబ్ధిదారులకు బోరు బావుల గ్రౌండింగ్‌పై అవగాహన కల్పించారు. అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దొంతాపూర్‌కు చెందిన 60 మంది యువకులు మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, ధర్మపురి బుగ్గారం జెడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్ తదితరులున్నారు.

బీమా చెక్కు అందజేత

గాయత్రీ బ్యాంకు సేవలు అభినందనీయమని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని గాయత్రీ బ్యాంకు ఖాతాదారు కందుల హరీశ్ ప్రమాదవశాత్తు మృతిచెందగా, మృతుడి తండ్రి వీరన్నకు బ్యాంకు తరుపున రూ.లక్ష బీమా చెక్కు అందజేశారు. అలాగే బుగ్గారం మండలం వెల్గొండ గ్రామానికి చెందిన చీర్నేని రామచంద్ర కుమార్తె భూమిక నరాల వ్యాధితో బాధపడుతుండగా గతంలో రూ.2 లక్షలు, గురువారం మరో రూ.3 లక్షలు విలువ గల ఎల్‌వోసీ అందజేశారు.

మట్టి తవ్వకాలపై వివాదం



రోడ్డుపై బైఠాయించిన కోనరావుపేట గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మండలంలోని కొండ్రికర్ల- కోనరావుపేట గ్రామాల మధ్య మట్టి తవ్వకాల విషయంలో వివాదం చోటుచేసుకుంది. వివరాలు.. తమ గ్రామ శివారు గుట్ట నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని గురువారం కోనరావుపే ట గ్రామస్తులు పెద్దగుండు సమీపంలోని క్రాసింగ్ వద్ద రహదారిపై బైఠాయించారు. కొండ్రికర్లలో ఇటీవల కురిసిన వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన కొట్టుకుపోయింది. దీంతో మళ్లీ తాత్కాలిక వంతెన ఏర్పాటుకు పైపులు వేసిన కొండ్రికర్ల గ్రామస్తులు కొండ్రికర్ల–కోనరావుపేట మధ్య గల గుట్ట వద్ద మంగళవారం నుంచి తవ్వకాలు చేపడుతూ ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ క్రమంలో మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే కారణంతో కోనరావుపేట గ్రామస్తులు బుధవారం మట్టి తవ్వకాల ప్రాంతానికి వెళ్లి 2 జేసీబీలు, ట్రాక్టర్‌ను గ్రామ పంచాయతీ వద్దకు తరలించారు. విషయం తెలుసుకున్న కొండ్రికర్ల వాసులు ఆగ్రహం చెంది కోనరావుపేటకు వచ్చి వాహనాలను తీసుకెళ్లారు. ఈక్రమంలో మట్టి తవ్వకాలు చేపడుతున్న విషయంపై రెవెన్యూ అధికారులకు ఫోన్ చేయగా, గృహలక్ష్మి సర్వేలో ఉన్నారని పట్టించుకోలేదని, తమపై దౌర్జన్యంగా దాడి చేసి వాహనాలను తీసుకెళ్లారని పోలీసులకు ఫోన్ చేసినా స్పందించలేదని కోనరావుపేటవాసులు ఆరోపించారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించగా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ శ్యాంరాజ్, ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ ఉమాసాగర్ ఆందోళనకారులను సముదాయించేందుకు ప్రయత్నించగా మొదట మొండికేసి తర్వాత ఆందోళన విరమించారు. అనంతరం మెట్‌పల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. కాగా కొండ్రికర్లకు చెందిన సుమారు 200 మంది తమ గ్రామపంచాయతీ కార్యాలయం, కొంతమందిపై దాడికి పాల్పడ్డారని కోనరావుపేట వాసులు ఫిర్యాదు చేశారు. అయితే కొండ్రికర్ల–కోనరావుపేట రెవెన్యూ గ్రామం ఒకటే కావడం గమనార్హం.

అక్టోబర్ 31 వరకు భూముల క్రమబద్ధీకరణ



కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: గతంలో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నోటరీ ద్వారా కొనుగోలు చేసిన పట్టణ ప్రాంత వ్యవసాయేతర భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబరు 84 ద్వారా వెసులుబాటు కల్పించినట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీవో 84ను అనుసరిస్తూ 125 గజాలలోపు స్థలం కలిగి ఉన్నవారి నోటరీ ప్లాట్లను ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా రెగ్యులరైజేషన్ చేయడం జరుగుతుందని, 125 గజాలు దాటిన వాటికి ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ మార్కెట్ వాల్యూ ప్రకారం స్టాంప్‌డ్యూటీ, రూ.5 పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకునే సమయంలో నోటరీ డాక్యుమెంట్‌తో పాటు, సదరు భూమికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు, ఆస్తిపన్ను, కరెంట్ బిల్లు, నీటిపన్ను చెల్లించిన రశీదులు, ఆధారాలను జతచేయాలన్నారు. నోటరీ భూముల క్రమబద్ధీకరణ వల్ల పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తాయని, సులభంగా క్రయవిక్రయాలు చేసుకోవచ్చన్నారు.

అన్ని వర్గాలను మోసం చేసిన కేసీఆర్

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

బుగ్గారం(ధర్మపురి): ఎన్నికలు సమీపిస్తుండడంతోనే సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రకటిస్తున్నారని, వాటిని అమలు చేసే చిత్తశుద్ధి ఆయనకు లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం బుగ్గారం మండలంలో పర్యటించారు. ముందుగా చిన్నాపూర్‌లో ఆత్మహత్య చేసుకున్న రామస్వామి, గుండెపోటుతో మృతిచెందిన అడ్వకేట్ విజయ్‌కుమార్ కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రెస్‌మీట్‌లో ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు గతంలో కేటాయించిన నిధులు ఏ మేరకు ఖర్చు చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతోనే ఆదరాబాదరగా అనేక పథకాలను ప్రకటిస్తున్నారని, సంక్షేమ ఫలాలు అర్హులందరికీ దక్కాలిగానీ వీటిలో కొంతమందినే ఎంపిక చేయడమేమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో రూ.మూడు లక్షలతో ఇల్లు ఏవిధంగా నిర్మించుకుంటారో తెలపాలని సీఎంను ప్రశ్నించారు. సీఎం కేసీఆర్‌చే తెలంగాణలోని అన్ని వర్గాలు మోసానికి గురయ్యాయని అన్నారు. సీఎం కేసీఆర్ పాత హామీలు అన్నీ నెరవేర్చాకే ఓట్లు అడగాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, బుగ్గారం, ధర్మపురి మండలాల అధ్యక్షులు వేముల సుభాష్, సంగనభట్ల దినేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దనవేణి శంకర్, నాయకులు సింహరాజు ప్రసాద్, నర్సాగౌడ్, చిగిరి అంజిత్, బీర్పూర్ తిరుపతి, కండ్లె మదన్, కొడిమ్యాల రాజన్న, పానకంటి కైలాసం, నక్క శంకర్, హైమత్, నక్క సాగర్, బీర్పూర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 1,519 దరఖాస్తులు

జగిత్యాలక్రైం: జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో గురువారం సాయంత్రం వరకు 1519 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. జగిత్యాలలో 32 షాపులకు గాను ఇప్పటి వరకు 678, ధర్మపురి సర్కిల్‌లో 14 షాపులకు 426, మెట్‌పల్లి పరిధిలో 25 షాపులకు 415 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా గురువారం 600 దరఖాస్తులు దాఖలయ్యాయి. కాగా మెట్‌పల్లి కౌంటర్‌లో దరఖాస్తుల స్వీకరణ ఇంకా కొనసాగుతోంది. ఈనెల 18 వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించబడతాయని, ఈనెల 21న జగిత్యాలలోని వీరూపాక్షి గార్డెన్స్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు డ్రా పద్ధతిలో షాపుల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

ఒంటికాలిపై ఏఎన్‌ఎంల నిరసన



నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

జగిత్యాల: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ఒంటికాలిపై నిల్చొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములవ్వాలి

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. గురువారం మెట్‌పల్లి మండలం వెల్లుల శివారులోని వీఆర్‌ఎం గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన యువత–మంచి భవిత అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. డ్రగ్స్, ర్యాగింగ్, క్రైం, ట్రాఫిక్ వయోలేషన్, సైబర్ అబ్యూజ్, మిస్యూజ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జీవన పోరాటంలో యువత తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే సత్ప్రవర్తన కలిగి ఉండాలని, లక్ష్యం ఎంత ఉన్నతంగా ఉంటే అంత గొప్పస్థాయికి ఎదుగుతారన్నారు. ప్రస్తుత కాలంలో యువత చెడు వ్యసనాలకు ఎక్కువగా అలవాటుపడుతున్నారని వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, మద్యం తాగి వాహనం నడపొద్దని, ట్రిపుల్ రైడింగ్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే తాను రాసిన పాట ×చేజారిన కొడుకు× సంబంధించిన వీడియో రూపకల్పన చేసిన దర్శకుడు రాజ్‌నరేంద్ర, గాయని సౌమ్య, నటి సుజాత, హర్షిణి, నటుడు సంతోష్, కెమెరామెన్ నరేశ్‌ను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీంద్రరెడ్డి, మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, కోరుట్ల సీఐ ప్రవీణ్, ఎస్‌ఐలు శ్యాంరాజ్, ఉమాసాగర్, నవీన్ పాల్గొన్నారు.

- డిజిటలైజేషన్ పద్ధతిలో పంపిణీ
- అందుబాటులోకి యూ–విన్ పోర్టల్
- గర్భిణులు, చిన్నారులు ఎక్కడైనా టీకా తీసుకోవచ్చు

టీకా.. ఇక పక్కా..



సిరికొండ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో చిన్నారికి టీకా వేస్తున్న ఏఎన్‌ఎం

కథలాపూర్(వేములవాడ): గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకా ఇప్పించాలంటే ఇప్పటివరకు కార్డు పట్టుకొని సమీపంలోని పీహెచ్‌సీ, ఆరోగ్య ఉపకేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఒక్కోసారి టీకా వేయాల్సిన రోజు మరిచిపోతే అంతే. ఇకనుంచి ఆ బాధలేకుండా టీకా వేయాల్సిన రోజు తప్పిపోకుండా ప్రభుత్వం వ్యాధి నిరోధక టీకా పంపిణీని డిజిటలైజేషన్ చేస్తోంది. దీనికోసం యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం 'యూ–విన్' పోర్టల్‌ను ప్రారంభించింది. ఈ విధానంలో టీకా ఏ రోజు తీసుకోవాలో ముందుగానే రిజిష్టర్ అయిన సెల్‌ఫోన్‌కు మెస్సేజ్ వస్తుంది. దీంతో వందశాతం వ్యాక్సినేషన్ అందడం ద్వారా భవిష్యత్తు తరం ఆరోగ్యంగా ఉంటుందని వైద్యశాఖ అధికారులు భావిస్తున్నారు.

షెడ్యూల్ ప్రకారం..

జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలు, పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో 6,936 మంది గర్భిణులు, 845 మంది చిన్నారులు టీకాలు వేయించుకునేవారు ఉన్నట్లు వైద్యశాఖ రికార్డుల్లో నమోదైంది. ఇన్నాళ్లు వీరు టీకాలు వేయించుకునేందుకు వెళ్లాలంటే ఆరోగ్య సంరక్షణ కార్డు తప్పనిసరి అవసరం ఉండేది. ప్రస్తుతం యూ–విన్ పోర్టల్‌లో ప్రతీ గర్భిణి, డెలివరీ అనంతరం శిశువు వివరాలు నమోదు చేస్తారు. దీంతో అటు గర్భిణిగా ఇటూ శిశువులకు షెడ్యూల్ ప్రకారం టీకా ఇచ్చేలా కుటుంబసభ్యులకు, వైద్యసిబ్బందికి ఈ పోర్టల్ ముందస్తుగా సెల్‌ఫోన్‌లో మెస్సేజ్ పంపిస్తుంది. యూ–విన్ పోర్టల్ అందుబాటులోకి రావడంతో సమస్యలుండవని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. టీకా వేసుకున్నట్లు సర్టిఫికెట్లు అవసరమున్నవారు ఈ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు.

యూ–విన్‌తో ఉపయోగాలు

చాలా మంది ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తుంటారు. ఈ క్రమంలో అనేక ప్రాంతాలు మారాల్సి రావడం సహజం. ప్రస్తుతం గర్భిణులు, చిన్నారుల వివరాలు యూ–విన్ పోర్టల్‌లో నమోదు చేయడంతో దేశంలో ఎక్కడికి వెళ్లినా కెటాయించిన ప్రత్యేక నంబర్ చెబితే వారి టీకాల సమాచారం వైద్యసిబ్బంది దగ్గర ఉన్న ట్యాబ్‌లో తెలుసుకోవచ్చు. మరోవైపు సెల్‌ఫోన్‌కు మెస్సేజ్ రావడంతో ఇబ్బంది ఉండదు. తాత్కాలికంగా ఉన్న ప్రాంతంలోనే టీకా వేయించుకోవచ్చు. యూ– విన్ పోర్టల్ విధానంతో టీకాలు వృథా కాకుండా నివారించవచ్చని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

కొత్త విధానంతో తప్పిన ఇబ్బందులు



గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు కొన్ని రోజులు అత్తగారిల్లు, మరికొన్ని రోజుల్లో తల్లిగారింట్లో ఉండటం అందరికీ తెలుసు. టీకాల తేదీ వచ్చిందంటే గర్భిణులు కార్డు పట్టుకొని అత్తగారి ఊరికి వెళ్లాల్సి వచ్చేది. చిన్నారుల కోసం బాలింతలు కూడా అత్తగారింటికి వెళ్తుంటారు. కొత్త విధానం వల్ల కార్డు లేకునాక్న సరే సెల్‌ఫోన్ మెస్సేజ్ ఆధారంగా ఎక్కడైనా టీకా తీసుకునే సౌకర్యం రావడంతో ఇబ్బందులు తప్పినట్లే. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– నల్బుని గంగు, మార్కెట్ కమిటీ డైరెక్టర్, కథలాపూర్

వంద శాతం టీకా లక్ష్యం



వ్యాధి నిరోధక టీకా పంపిణీకి సంబంధించి డిజిటలైజేషన్ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన యూ–విన్ పోర్టల్‌లో గర్భిణులు, చిన్నారుల వివరాలు నమోదు చేయాలని వైద్యసిబ్బందికి ఆదేశాలిచ్చాం. ఈ ప్రక్రియ కొనసాగుతుంది. కొత్త విధానంతో వందశాతం టీకా పంపిణీ లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చు. గర్భిణులు, చిన్నారులకు టీకాలు సక్రమంగా వేయిస్తే భవిష్యత్తు తరం ఆరోగ్యకరంగా ఉంటుంది.

– శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత


బొలెరో వాహనంలో రేషన్ బియ్యం

జగిత్యాలక్రైం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం ఉదయం జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద పట్టణ పోలీసులు పట్టుకున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి బొలెరో వాహనంలో తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సర్దార్ పాపన్న జయంతి


నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాల: గోపా జిల్లా శాఖ ఆధ్వర్యంలో సర్దార్ పాపన్నగౌడ్ జయంతిని ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తొలి తెలుగు మహావీరుడు, బహుజన చక్రవర్తి పాపన్నగౌడ్ బహుజనులందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, ట్రెజరర్ సత్యనారాయణగౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్యగౌడ్, సలహాదారు నేరెళ్ల మల్లేశంగౌడ్, భూమయ్య, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

సబ్ సెంటర్ సందర్శన


వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని వేములకుర్తి సబ్‌సెంటర్‌ను నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ సభ్యులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, నాణ్యత ప్రమాణాలు, రికార్డులు తదితరవాటిని పరిశీలించారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ మహాలక్ష్మి, ఎలిజబెత్, వార్గీస్, డీఎంహెచ్‌వో శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డీపీవో స్వామి, క్వాలిటీ టీం మేనేజర్ నాగరాజు, సర్పంచు నవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ చిత్రం వీక్షణ


గాంధీ చిత్రం వీక్షిస్తున్న విద్యార్థులు

జగిత్యాల: గాంధీజీ గొప్పతనం నేటితరానికి తెలియాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం గాంధీచిత్రాన్ని థియేటర్లలో ప్రదర్శిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 14,891 మంది విద్యార్థులు గాంధీచిత్రాన్ని వీక్షించారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకే ఉచితంగా గాంధీ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

తపస్ ధర్నా విజయవంతం చేయండి


సభ్యత్వ నమోదులో నాయకులు

రాయికల్(జగిత్యాల): ఉపాధ్యాయుల సమస్యల సాధనకు ఈనెల 19న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తపస్ ఆధ్వర్యంలో జరిగే ధర్నాకు తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య కోరారు. గురువారం రాయికల్ మండలం అల్లీపూర్, ఆలూరు, రాయికల్, భూపతిపూర్ గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీఆర్సీ కమిటీ వేసి మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులు వారి సొంత జిల్లాలకు బదిలీ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ఎలిగేటి రాజేంద్రప్రసాద్, జిల్లా నాయకులు చెరుకు మహేశ్వరశర్మ, రాజ్ మహ్మద్, మండల అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

గడువు పెంపు

జగిత్యాల: అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాల డిగ్రీ ప్రవేశాలకు 2–3 సంవత్సరాల ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు సెప్టెంబర్ 5 వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 20 వరకు, రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 30 వరకు అవకాశం ఉందని, ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరికి ప్రత్యామ్నాయం ఆయిల్‌పామ్

- జిల్లాలో పెరుగుతున్న విస్తీర్ణం.. రాష్ట్రంలో మూడో స్థానం
- ఈ ఏడాది 9,100 ఎకరాల్లో సాగుకు ప్రణాళిక


ఆయిల్‌పామ్ తోటలో అంతరపంటలు సాగు చేసిన రైతుతో ఉద్యానశాఖాధికారి స్పందన

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగవుతుంది. మొదటి ఏడాది (2022–23) విజయవంతంగా 1,832 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును రైతులు చేపట్టారు. లక్ష్యం భారీగా ఉన్నా మొక్కలు అందుబాటులో లేక అంతంతమాత్రమే సాగు చేశారు. అయితే ఈ ఏడాది (2023–24)లో 9,100 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆయిల్‌పామ్‌కు జిల్లా వాతావరణం, నేలలు, సాగు నీరు అనుకూలంగా ఉండటంతో మరింత విస్తీర్ణం పెంచాలంటూ ఉద్యానశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే దాదాపు 3 వేల ఎకరాల్లో సాగుకు దరఖాస్తులు రాగా, అందులో 1,832 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు మంజూరు ఇవ్వగా, ప్రస్తుతం 1,300 ఎకరాల్లో నాటారు. ఆయిల్‌పామ్ సాగులో జిల్లా మూడో స్థానంలో ఉండటం విశేషం.

3 లక్షల మొక్కలు సిద్ధం

జిల్లాకు మొక్కలు సరఫరా చేసే లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌లో ఆయిల్‌పామ్ నర్సరీ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం నర్సరీలో 3 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. సాగుకు దరఖాస్తులు చేసుకున్న వెంటనే మొక్కలు సరఫరా చేస్తున్నారు. అయితే లక్ష్యం పూర్తయ్యే వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు, నీటి వసతి ఉంటే ఏడాది పొడవునా ఎప్పుడైనా మొక్కలు నాటుకునే వెసులుబాటు ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వాల ప్రోత్సాహంతో..

జిల్లాలో సాగయ్యే నూనెగింజల పంటల్లో వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటల విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో భూగర్భజలాలు ఎక్కువగా ఉన్న జగిత్యాల జిల్లా వంటి ప్రాంతాల్లో ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. కాగా అటు ఎస్సారెస్పీ, ఇటు వరదకాల్వతో జిల్లాలో దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండటంతో ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో వరిని తగ్గించేందుకు ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నారు.

రైతులకు లాభం ఇలా..

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు సబ్సిడీపై మొక్కలు సరఫరా చేస్తారు. ప్రభుత్వమే రేటు నిర్ణయించి ఆయిల్ ఉత్పత్తి చేసే కంపెనీలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతం టన్నుకు రూ.10 వేల నుంచి 15 వేల ధర ఉంది. ఎకరాకు 8–10 టన్నుల దిగుబడి వస్తుంది. ఈ పంటను సాగు చేసే రైతులకు డ్రిప్ ఇవ్వనున్నారు. నాలుగేళ్ల పాటు తోట నిర్వహణ ఖర్చులు కూడా ఇస్తున్నారు. పంటకు కోతులు, పిట్టలు, అడవి పందుల బెడద ఉండదు. తెగుళ్లు, పురుగులు తక్కువగా సోకే అవకాశం ఉంది. రసాయన ఎరువులు పెద్దగా వేయాల్సిన అవసరం లేదు. ఎకరాకు దాదాపు రూ.80 వేల నుంచి రూ.లక్ష ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే మొదటి ఏడాది ఖర్చు ఎక్కువగా వచ్చినా 40 ఏళ్ల పాటు తోట ఉంటుంది కాబట్టి ఏటా ఆదాయం పెరగనుంది.

ఐదేళ్ల పాటు ఇతర పంటలు

ఆయిల్‌పామ్ మొక్కలు విత్తిన ఐదారేళ్ల నుంచి కాపునకు వస్తాయి. అప్పటి వరకు అంతరపంటలు సాగు చేసుకోవచ్చు. వేసవిలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. డ్రిప్ ద్వారా రోజూ నీరు పెట్టాలి. త్రిభుజాకారం పద్ధతిలో ఎకరాకు 57 మొక్కలు నాటుకోవాలి. కాతకు వచ్చిన తర్వాత ఒక్కో మొక్కకు ఏడాదికి 10–14 గెలలు వస్తాయి. ఎకరం వరి పంటకు ఉపయోగించే నీటితో 3 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసుకోవచ్చు.

మూడెకరాల్లో సాగు చేశా



మూడెకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశా. మొక్కలు త్వరగా ఎదుగుతున్నాయి. అంతర పంటలుగా ఎత్తు తక్కువగా ఉన్న పెసర, పసుపు, సోయాబీన్ పంటలు వేశా. ఆయిల్‌పామ్‌కు డ్రిప్ ద్వారా ఎరువులు, సాగునీరు అందిస్తున్నా.

– పడిగెల గంగారెడ్డి, పోరండ్ల

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



ఆయిల్‌పామ్ సాగుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. మొదటి ఏడాది సాగు చేసిన తోటలు బాగా ఉన్నాయి. రెండో ఏడాది సాగు చేసేందుకు చాలా మంది రైతులు ముందుకు వస్తుండటంతో జిల్లాకు అదనపు సాగు లక్ష్యం ఇచ్చారు.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

ఆరోగ్య సమాజంతోనే దేశాభివృద్ధి


మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): ఆరోగ్యకర సమాజంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని మెట్‌పల్లి డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వాసవీకన్యక పరమేశ్వరి ఆలయ ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుడు క్యాతం సురేశ్‌రెడ్డి సొంత ఖర్చులతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. శిబిరంలో 210 మందికి పరీక్షలు నిర్వహించి రూ.70వేల విలువ గల మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్స కోసం 120 మందిని కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజనఆదిరెడ్డి, రైతు సమన్వయ కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎస్సై నవీన్‌కుమార్, ఎంపీడీవో జగదీష్, ఎంపీటీసీ ఆకుతోట రాజేష్, లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ గంగుల మురళి, రీజినల్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, మండల అధ్యక్షుడు కనుక సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ బీసీ బంధు

- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


బీసీ బంధు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): అర్హులందరికీ బీసీ బంధు విడతల వారీగా వస్తుందని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద 55 మంది బీసీ కులవృత్తుల వారికి ఒక్కొక్కరికి రూ.1 లక్ష ఆర్థిక సాయం చెక్కులు, 11 గ్రామాల్లో 40 కులసంఘాల అభివృద్ధికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ సంఘ సభ్యులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేస్తున్నారని, వారి ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రావడం ఖాయం అని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, ఎంపీడీవో ప్రభు, డిప్యూటీ తహసీల్దార్ పద్మ, సర్పంచు నేమూరి లత, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఎంపీవో కృపాకర్, ఎంపీటీసీ తిమ్మణి రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు తెగినా పట్టించుకోరా..?


కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): వర్షాలతో రోడ్లు తెగినా మరమ్మతుల గురించి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ నాయకురాలు తుల ఉమ మండిపడ్డారు. కథలాపూర్ మండలం ఇప్పపెల్లి శివారులో వరద కోతకు గురై ప్రమాదకరంగా మారిన రోడ్డును గురువారం పరిశీలించారు. కోరుట్ల– వేములవాడ డబుల్ రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుందని తెలిసినా మరమ్మతులపై జాప్యం చేయడం సిగ్గుచేటన్నారు. కోతలకు గురైన రోడ్డును స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు పరిశీలించినా నిధులు కేటాయించకపోవడం సమంజసం కాదన్నారు. త్వరగా మరమ్మతులు చేయించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీరాముల ప్రకాశ్, మామిడిపెల్లి ప్రవీణ్‌గౌడ్, మేడిపెల్లి గంగాధర్, బద్రి, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సేద్యంతో అద్భుత ఫలితాలు


సదస్సులో వ్యవసాయ విద్యార్థులు, శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: ఆధునిక సేద్యంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రజనీదేవి అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తల దత్తత గ్రామం అల్లీపూర్‌లో రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఐక్యంగా సంఘాలు ఏర్పాటు చేసుకుని ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు విక్రయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సుమలత, ఉప సర్పంచ్ సాగర్‌రావు, ఎంపీటీసీ విజయలక్ష్మి, రైతు బంధు కోఆర్డినేటర్ సత్యం, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

కులవృత్తులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్(జగిత్యాల): గ్రామీణ ప్రాంతాల్లోని కులవృత్తులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం రాయికల్ మండలం చింతలూరు గ్రామంలో మీరు-నేను కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ అదనపు పనులకు రూ.2.50 లక్షలు మంజూరు చేయగా, ఒడ్డెలింగాపూర్, మంక్యానాయక్‌తండా, లోక్యానాయక్‌తండాల్లో బీటీ రోడ్లకు రూ.1.20 కోట్లు మంజూరయ్యాయని, పనులు త్వరలోనే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం మండలంలో 23 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.7 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. పల్లెనిద్ర ద్వారా ప్రతి గ్రామంలో సమస్యలను తెలుసుకుని యుద్ధప్రతిపాదికన పరిష్కరిస్తున్నామని వివరించారు. అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ నాయకులు విమర్శలు చేయడం అలవాటుగా మారిందన్నారు. పార్టీ పటిష్టతకు బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, ఏఎంసీ చైర్మన్ మారంపల్లి రాణి, సర్పంచ్ అనుపురం శ్రీనివాస్‌గౌడ్, పాలకుర్తి రవి, జక్కుల చంద్రశేఖర్, బెజ్జంకి రమాదేవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆత్మహత్య కారకులపై చర్యలు తీసుకోవాలి


ఆందోళన చేస్తున్న యువకుడి బంధువులు, కుటుంబ సభ్యులు


ప్రశాంత్ (ఫైల్)

జగిత్యాలక్రైం: యువకుడి ఆత్మహత్యకు కారకులపై వెంటనే చర్యలు చేపట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు గురువారం ఆందోళన చేపట్టారు. ధర్మపురి మండలం రాయపట్నం గ్రామానికి చెందిన ప్రశాంత్ (26) భార్యతో పాటు అత్తింటి వేధింపులు భరించలేక జూలై 30న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తనను భార్యతో పాటు అత్త, బావమరిది మరికొంత మంది వేధించారని, దాడి చేశారని, దీంతో తాను పురుగుల మందు తాగానని యువకుడు వీడియో విడుదల చేశాడు. ఈ నేపథ్యంలోనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రశాంత్ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. గురువారం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆత్మహత్యకు కారకులైన ఏడుగురిపై ఫిర్యాదు చేయగా, పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేస్తామని చెప్పడంతో పోస్టుమార్టం చేసేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించి పాతబస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టారు. పట్టణ సీఐ నటేశ్ బాధితులతో మాట్లాడి జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామిని కల్పించారు. బాధ్యులందరిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో వారు శాంతించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

అర్హులందరికీ బీసీబంధు మంజూరు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న శ్రావణి, తదితరులు

రాయికల్(జగిత్యాల): అర్హులందరికీ బీసీ బంధు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. గురువారం రాయికల్ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి శ్రావణి, పార్టీ జిల్లా నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ అర్హులకు బీసీబంధు, నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని, గృహలక్ష్మి దరఖాస్తుల గడువు పొడగించాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, పట్టణ అధ్యక్షుడు ధర్మపురి, నాయకులు మచ్చ నారాయణ, కుంబోజి రవి, సంజీవ్, సామల్ల సతీశ్, రాపర్తి రామేశ్వరి, సుమన్, రవి, నర్సయ్య, నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.

బదిలీల బాధ్యత సంఘానిదే


సభ్యత్వ నమోదులో నాయకులు

వెల్గటూర్(ధర్మపురి): 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయుల బదిలీ బాధ్యత పీఆర్‌టీయూటీఎస్ సంఘానిదేనని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాల్ల అమర్‌నాథ్‌రెడ్డి, బోయినిపల్లి ఆనందరావు అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా వెల్గటూర్ మండల కేంద్రంతోపాటు కప్పారావుపేట, గుల్లకోట, కొండాపూర్, ఎండపల్లి, జగదేవుపేట గ్రామాల్లోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చింతపండు నర్సింగం, ప్రధాన కార్యదర్శి నిమ్మ రవి, మండల కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ఏవీఎస్ రాజు, దహెగం గణేష్, చీటి భూపతిరావు, శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం


హన్మవ్వ మృతదేహం

కోరుట్ల: పట్టణ శివారులోని కంచర కుంటలో గురువారం రాత్రి మహిళ మృతదేహం లభ్యమైంది. పట్టణంలోని ఏసికోని గుట్ట ప్రాంతానికి చెందిన జాకిరాల హన్మవ్వ(50)గా పోలీసులు గుర్తించారు. హన్మవ్వకు మతిస్థిమితం సరిగా లేదు. బుధవారం ఇంట్లో నుంచి వెళ్లిన ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించగా కంచరి కుంటలో శవమై కనిపించింది. గతంలో కూడా ఓ సారి క్రిమిసంహారక మందు తాగిందని ఆమె భర్త గంగారాం పేర్కొన్నాడు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన మార్కం అంజయ్య (46) పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. అంజయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య వజ్రవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కానిస్టేబుల్ వీరంగం



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాసుపత్రి పోలీస్ ఔట్‌పోస్టులో విధులు నిర్వహించే ఓ కానిస్టేబుల్ బుధవారం రాత్రి వైద్యం కోసం వచ్చిన పేషెంట్‌పై లాఠీ ఝుళిపిస్తూ వీరంగం సృష్టించిన సంఘటన పేషెంట్లను, సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసింది. ఆసుపత్రి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం రాత్రి నగరానికి చెందిన సతీశ్‌కు తలకు గాయమై చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చాడు. సీవోటీ వద్ద చికిత్స పొందుతుండగా.. సతీశ్‌ను లాఠీతో కొడుతూ, బూతులు తిడుతూ కానిస్టేబుల్ హల్‌చల్ చేయడంతో రోగులు, సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. ఇదే విషయంపై టౌన్ ఏసీపీ నరేందర్‌ను సంప్రదించగా... జరిగిన సంఘటనపై విచారణ చేస్తున్నామని, నివేదిక ఆధారంగా శాఖపరమైన చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ మంచిర్యాల చౌరస్తా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ చనిపోయాడు. కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండల కేంద్రానికి చెందిన గుర్రం రాంచందర్(73) రిటైర్డు హెడ్‌కానిస్టేబుల్. గురువారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వైద్యపరీక్షలు, మందుల నిమిత్తం బైక్‌పై వస్తున్నాడు. మంచిర్యాల చౌరస్తా సమీపంలో వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొండగట్టు ఆలయ చైర్మన్‌పై ఫిర్యాదు



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ తిరుక్కోవెళూర్ మారుతిస్వామిని పదవి నుంచి తొలగించాలని గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు ఆలయ బోర్డు సభ్యులు జున్న సురేందర్, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఆలయంలో ఈనెల 9న హుండీల లెక్కింపు నిర్వహించగా ఆ సమయంలో మారుతిస్వామి హుండీలో వచ్చిన బంగారం, వెండి వస్తువులను బయటకు తీసుకెళ్లారని ఆరోపించారు. సీసీ ఫుటేజీల్లో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు.